



రాష్ట్రంలో మహిళలకు
మంచి రోజులు రాబోతున్నాయి

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూలై 12: రాష్ట్రంలోని మహిళలకు మంచి రోజులు రాబోతున్నాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ పరిధిలోని లబ్ధిదారులకు 45 మందికి కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీఆర్ఎస్ పార్టీ ఖజనా ఖాళీ చేసిందని, అయినా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళలకు మంచి రోజులు రాబోతున్నాయని కొంత ఓపిక పట్టాలని కోరారు . మహాలక్ష్మి పథకం ద్వారా మహిళకు రూ.2500లు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ మంజుల రమేష్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు రమేష్ కుమార్, ముత్తహార్ షరీఫ్ కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా అమ్మవార్లు


శాకాంబరిగా అలంకరణలో కన్యకా పరమేశ్వరిమాత

తాండూరు నగరేశ్వర దేవాలయంలో వరహి నవరాత్రి ఉత్సవాలు వైభవం జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం కన్యకా పరమేశ్వరి మాత శాకాంబరి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఆషాఢమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళ సంఘం అధ్యక్షురాలు కొట్రిక నాగలక్ష్మి, కార్యదర్శి మంకాల స్వప్న, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, కౌన్సిలర్ సాహుశ్రీలత, తదితరులు పాలొన్నారు. కాగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో కొలువుదీరిన సర్వమంగళా సమేత స్పటిక లింగేశ్వర స్వామి దేవాలయంలో అషాఢమాస పూజల్లో భాగంగా అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో సర్వమంగళాదేవి అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తాండూరు/ఘట్‌కేసర్ జూలై 12

కూరగాయల అలంకరణలో సర్వమంగళాదేవి అమ్మవారు


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

అమ్మ ఆదర్శ పాఠశాలల
పనులు పూర్తి చేయాలి

» కలెక్టర్ ప్రతీక్ జైన్

దోమ, జూలై 12: దోమ మండలంలోని వివిధ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బొంపల్లి, బాసుపల్లి గ్రామాల్లో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో వంట గది, వరండా, వాటర్ సంపు, మూత్రశాలలు తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలు ఉండేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పాఠశాలల పరిసరాలను పరిశుభ్రగంగా ఉంచాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దోమ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలతో మాట్లాడారు. అదే విధంగా దోమ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి వంట గది, మూత్ర శాలలు, నీటి సరఫరాను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఎంపీడీవో మహేశ్ బాబు, తహసీల్దార్ పురుషోత్తం, ఈఈ బాబు శ్రీనివాస్, ఎంఈవో హరిశ్చంద్ర, పద్మజ, ఉపాధ్యాయులు, వైద్యురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ పీఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ



రికార్డులను పరిశీలిస్తున్న కోటిరెడ్డి

మేడ్చల్ టౌన్, జూలై12 : మేడ్చల్ పీఎస్‌ను డీసీపీ కోటిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్టేషన్‌లో సిబ్బంది పని తీరు, ఆయుధాలు, రికార్డులు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను, పోలీస్టేషన్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన భద్రతను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నైట్ పెట్రోలింగ్, ఇతర భద్రత చర్యల గురించి సీఐ సత్యనారాయణ డీసీపీకి వివరించారు. భద్రత విషయంలో రాజీ పడకుండా విధులు నిర్వహించాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు.

రేషన్ కార్డులు లేక నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. ఏళ్లు తరబడి కొత్త రేషన్ కార్డులకు నోచుకోక ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త రేషన్ కార్డులు వస్తాయని ఆశించిన పేదలకు ఇంకా ఎదురు చూపులు తప్పడం లేదు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీల్లో ఒక్కో హామీ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా.. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయంలో ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు.

» మార్పులు, చేర్పులకు కూడా నోచుకోని వైనం
» సంవత్సరాల తరబడి తప్పని ఎదురు చూపులు
» గ్యారెంటీలకు రేషన్ కార్డు తప్పనిసరి చేసిన యంత్రాంగం
» ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్న పేదలు





కొత్త రేషన్ కార్డుల
జారీ ఎప్పుడో!

వికారాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల ద్వారా లబ్ధి పొందడానికి రేషన్ కార్డు తప్పనిసరిగా మారింది. రేషన్ కార్డులు ఉన్న పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నా రేషన్ కార్డులు లేని పేదల సంగతేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీలతో లబ్ధి పొందడానికి అన్ని అర్హతలు ఉన్నా.. రేషన్ కార్డు లేని కారణంగా వేలాది పేద కుటుంబాలు దూరమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 2,41,179 రేషన్ కార్డులు ఉండగా, వీటిలో 8,09,218 మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. ఈ కార్డుల్లో ఆహార భద్రత కార్డులు 2,14,503 ఉండగా, వీటిలో 7,34,077 మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 26,640 ఉండగా, వాటిలో 75,101 మంది నమోదు కాగా, అన్నపూర్ణ అన్న యోజన కార్డులు 36 ఉండగా, వాటిలో 40 మంది నమోదయ్యారు. రేషన్ కార్డుదారులకు యూనిట్ల ఆధారంగా నెలనెలా రేషన్ పంపిణీ చేస్తున్నారు. గత డిసెంబర్ నెలలో ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం అందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తే.. ఆరు గ్యారంటీలతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీల్లో ఒక్కో హామీ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా.. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం మాత్రం ఇంత వరకు స్పష్టత రాలేదు.

రేషన్ కార్డుల వివరాలు

రేషన్ కార్డులు	సంఖ్య	యూనిట్లు
ఆహార భద్రత	2,14,503	7,34,077
అంత్యోదయ	26,640	75,101
అన్నపూర్ణ	36	40
మొత్తం రేషన్ కార్డులు	2,41,179	
నమోదైన కుటుంబ సభ్యులు	8,09,218	

తప్పని ఎదురు చూపులు...

కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా.. కనీసం ఆ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పేదలు నష్టపోతున్నారు. రేషన్ కార్డుపై నమోదైన కుటుంబ సభ్యులకు అదనంగా పేర్లు చేర్చడం, లేదా తొలగించడానికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదు. ఫలితంగా వివాహమైన కుటుంబంలో కొత్తగా చేరిన కోడళ్లు, జన్మించిన పిల్లల పేర్లు రేషన్‌కార్డులో చేర్చాల్సి ఉండగా, వివాహమైన కూతురు, వేరు కాపురం పెట్టిన వారి వివరాలను రేషన్ కార్డులో నుంచి తొలగించాల్సి ఉండగా ఆ అవకాశం లేకుండాపోయింది. ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాలతో ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరుగా కాపురం పెట్టిన వారు కొత్త రేషన్ కార్డులకు నోచుకోవడం లేదు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ పరిమాణంలో మాత్రం మార్పు లేదు. రేషన్ కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగానే రేషన్ సరఫరా చేస్తున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేకపోవడంతో పాత కోటా ప్రకారమే రేషన్ పంపిణీ చేస్తున్నారు.

26 వేల అభ్యర్థనలు

గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం ప్రజల నుంచి 26 వేలకు పైగానే అభ్యర్థనలు వచ్చాయి. 2014, డిసెంబరు 31 నుంచి 2024, జూలై 10వ తేదీ వరకు పౌర సరఫరాల శాఖ పోర్టల్‌లో ఈ దరఖాస్తులు నమోదయ్యాయి. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగిస్తున్న అధికారులు కొత్త పేర్లను మాత్రం చేర్చకపోవడం గమనార్హం. కూతురు వివాహం కాగానే పుట్టింటి రేషన్ కార్డులో నుంచి ఆ యువతి పేరు తొలగిస్తున్న అధికారులు అత్తింటి వారి రేషన్‌కార్డులో ఆ యువతి పేరు చేర్చడం లేదు. ఫలితంగా పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్లే కోడళ్లకు రేషన్ కోటా మాత్రం దక్కడం లేదు. రేషన్ కార్డుల్లో కొత్తగా నమోదు చేసే చేయాల్సిన ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో లాక్ చేయడంతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. గత డిసెంబరు నెలలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో కొత్తరేషన్ కార్డుల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని, రేషన్ కార్డులో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేదలు కోరుతున్నారు.

ప్రజా విశ్వాసాన్ని
కోల్పోయిన కాంగ్రెస్

సీఎం ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి, సీఎం సొంత జిల్లాలోనే బీజేపీ జెండా ఎగిరింది

» పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవలేదు
» స్థానిక ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించాలి
» రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


సమావేశానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

రంగారెడ్డి అర్బన్/శంషాబాద్ రూరల్, జూలై 12 : అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శంషాబాద్‌లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర నేతలు పాల్గొన్నారు. రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. బీజేపీ సభ్యత్వం, సంస్థాగత ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగిరిందని ఆనందం వ్యక్తం చేశారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవలేక ప్రజాగ్రహానికి గురైందని తెలిపారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలు సాధించేలా పార్టీ శ్రేణులు మరింతగా కృషి చేయాలని ఆయన తెలిపారు. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి సభ్యత్వం చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.


మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

అబద్ధపు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి..

» బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ

కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని రకాలుగా అడ్డుకున్న 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా, అధిక స్థానాలు సాధించేలా బీజేపీ శ్రేణులు మరింతగా కృషి చేయాలన్నారు. ప్రపంచంలో భారత్‌ను నెంబర్ వన్‌గా చేసే సంకల్పంతో మోదీ ముందుకు వెళుతున్నారని ఆమె చెప్పారు.

రేవంత్‌రెడ్డిని బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

» ఎంపీ ధర్మపురి అరవింద్

ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే సీఎం రేవంత్‌రెడ్డిని బొంద పెట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 8 నెలలవుతున్నా ప్రజా సమస్యలు, ఇచ్చిన వాగ్దానాలు అలాగే ఉన్నాయన్నారు. సమస్యలు తీరాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆయన తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీకే ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసినా మంచి ఫలితాలను బీజేపీ సాధించిందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ వార్డు సభ్యుల నుంచి మున్సిపాలిటీల వరకు అన్ని స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, గూడెపు నాగేష్, ఎమ్మెల్యేలు ఎల్మటి మహేశ్వర్‌రెడ్డి, కాటెపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేషరెడ్డి, పాల్వాయి హరీష్, పాల్వాయి శంకర్, ఎమ్మెల్సీ ఏవీన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్ రెడ్డి, బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తల్లోజు ఆచారి, వీరేందర్‌గౌడ్, కేవస్ రత్నం, అంజన్ కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రేమ్‌రాజ్, కొప్పు భాష, తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు బుక్కా వేణుగోపాల్, మైలార్‌దేవుల పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీ నాయకులకు సన్మానం చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ విలేకరుల వద్దకు వచ్చి వారితో కలిసి భోజనం చేశారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

» సమీక్షా సమావేశంలో కలెక్టర్ గౌతమ్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 12: జిల్లాలో 63 లక్షల మొక్కలు నాటి వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో వనమహోత్సవం, అమ్మఆదర్శ పాఠశాలల పనులు పూర్తి, ప్రజాపాలన కేంద్రాల ఏర్పాటుపై జిల్లా అధికారులు, మున్సిపల్, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణిత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఇంటింటి మొక్కలు పంపిణీ చేసి, వాటి సంరక్షించే విధంగా ప్రజలకు తెలియజేయాలని, మొక్కల పెంపకంతో మానవ మనుగడ సాగుతుందని, భవిష్యత్ తరాలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతవరణం అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకం విజయవంతంగా కొనసాగేలా అమలు తీరును పర్యవేక్షించాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాంబశివరావు, డీఈవో విజయకుమారి, డీఎఫ్‌వో జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ.

మేడ్చల్ టౌన్ : ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేస్తున్నామని మేడ్చల్ మున్సిపల్ 23వ వార్డు కౌన్సిలర్ కౌడె మహేష్ అన్నారు. శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా తన వార్డులో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వార్డులో ప్రతి ఒక్కరూ ఇంట్లో కనీసం ఒక మొక్కను నాటాలన్నారు. అందరికీ మొక్కలు అందజేసే బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు.

మందులు కోనుగోలు చేసిన వైద్యాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూలై 12: తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత పేరిట 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషనల్‌లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అదనపు కలెక్టర్, వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ స్పందించారు. వెంటనే అత్యవసర మందుల కోనుగోలుకు ఆదేశాలు చేశారు. ఎమర్జెన్సీ కోసం 600 ప్యారా సిటమాల్, సిరప్, 200స్పారక్ మెట్రో జిల్ సిరప్ కోనుగోలు చేసినట్లు ఆర్ఎంవో డాక్టర్ అనిల్ కుమార్ చెప్పారు. సెంట్రల్ స్టోర్‌రూం నుంచి ఇంకా కావాల్సిన మందుల కోసం స్టోర్ ఇన్‌చార్జికి తెలియజేశామని డీఎంహెచ్‌వో చెప్పారు. ఇకపై ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

స్వయంశక్తితో ఉపాధి పొందడం హర్షణీయం


మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్

కొడంగల్, జూలై 12: మహిళలు స్వయంశక్తితో ఉపాధి పొందడం హర్షణీయమని జిల్లా అటవీ శాఖ అధికారి, కొడంగల్ మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్యలో ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య, సమగ్ర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొంది ఉపాధి పొందుతూ ఇతరులకు ఉపాధినివ్వడం సంతోషదాయకం అన్నారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కుట్టు మిషన్ కేంద్రాలు, మహిళా శక్తి కేంద్రాలు, మీసేవ కేంద్రాలతో ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి మహిళా సంఘం సభ్యులు గ్రామాల్లో ఇతరాత్ర ఉపాధి వ్యాపారాలు చేస్తారని తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల్లో సైతం మహిళా సంఘాలకు ప్రాధాన్య కల్పిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉషశ్రీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజిలమ్మ, ఏపీయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

19న కొబ్బరికాయల విక్రయానికి వేలం

మోమిన్‌పేట్, జూలై 12: మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ శంకర్ భారత్ మహారాజ్ ఆశ్రమంలో గల ఎన్కతల శనీశ్వర ఆలయంలో ఈ నెల 19న కొబ్బరి కాయల విక్రయం, పూజా సామగ్రి విక్రయానికి వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వి.నరేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 19న ఉదయం 11:30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం దక్కించుకున్న వారికి ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలతో పాటు పూజా సామగ్రిని విక్రయించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన మల్టీజోన్ ఐజీపీ


ఐజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎస్పీ

వికారాబాద్, జూలై 12: వికారాబాద్ ఎస్పీ కార్యాలయాన్ని మల్టీ జోన్ ఐజీపీ సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఐజీపీకి ఎస్పీ నారాయణరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఏఆర్ పోలీస్ అధికారులతో ఐజీపీ గౌరవ వందనం చేశారు. అనంతరం ఐజీపీ జిల్లా ఎస్పీతో జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ అదనపు ఎస్పీ పీపీ మురళీధర్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో మోస్తారు వర్షం


ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్, జూలై12: ఘట్‌కేసర్‌లో శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు మోస్తారు వర్షం కురిసింది. గంటన్నర పాటు కురిసిన మోస్తారు వర్షంలో వీధుల్లో, రోడ్లపై కొద్దిపాటి వరదలు పారాయి. రెండు రోజులుగా సాయంత్రం సమయంలో కురుస్తున్న వర్షం రైతుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి.


చౌదరిగూడలో బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న మహిళలు, చిన్నారులు

ఘనంగా పోచమ్మ బోనాలు

చౌదరిగూడ, జూలై 12: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వీరన్నపేటలో గ్రామ దేవత పోచమ్మకు ప్రజలు బోనమెత్తారు. శుక్రవారం గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి బోనం తయారుచేసుకొని మహిళలు ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. యువకులు కేరింతలు మధ్య బోనాలు, ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిసిందీ ప్రజలు సుఖసం తోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నారు.



చెరువును తలపిస్తున్న షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డు

కొందుర్గు, జూలై 12: మండల కేంద్రంలోని షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డుపై చిన్నపాటి వర్షం చినుకులకే నీరు నిలిచి చెరువును తలపి స్తోంది. ప్రతి రోజు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ వైపు, వికారా బాద్ జిల్లా పరిగికి వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రంగారెడ్డి జిల్లాకు సరిహద్దు మండలం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. చిన్న పాటి వర్షానికే షాద్‌నగర్-పరిగి రోడ్డుపై నీరు నిలు స్తుంటోంది. శుక్రవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులకు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో షైనీ లెర్ వంక్షన్‌హాల్‌కు సమీపంలోని బీటీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డుకు ఒక వైపు గుంత తీసి ఆ మట్టిని రోడ్డుకు దగ్గరగా పోయడంతో నీరు వెళ్లేం దుకు వీలు లేకుండా ఉంది. దాంతో వర్షపు నీరు షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్ప డుతున్నాయి. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పై గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మొయినాబాద్ రూరల్, జూలై 12: పోటీ ప్రపంచంలో విద్యార్థులు చురు కుగా ఉండాలని.. నైపుణ్యాలను పెంపొందించుకోవా లని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ సూచించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల జోగిన్‌పల్లి భాస్కరరావు ఇంజ నీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి జరిగిన 13వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జోగిన్‌పల్లి భాస్కర విద్యాసంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు, పీవీజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్‌లు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసుకున్న 450 మంది విద్యార్థులకు వారు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం జస్టిస్ వేణుగోపాల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులు చురుకుగా ఉండాలని, న్యాయ శాస్త్రం పై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రిన్సిపల్ కృష్ణా మాచారి, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

బీమా పాలసీలు గ్రామీణ ప్రజలకు వరం

తాండూరు, జూలై 12: పోస్టాఫీసుల ద్వారా బీమా పాల సీలు గ్రామీణ ప్రజ లకు ఒక వరం లాంటివని సికింద్రా బాద్ డివిజన్ సీని యర్ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం అన్నారు. తాండూ రులో శుక్రవారం ఇద్దరు గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కస్టమర్ల నామినీలు అయిన అరుణకు రూ.2లక్షల96వేలు, చంద్రమ్మయాకు రూ.91వేల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవలం సంవత్సరానికి రూ.520 ప్రీమియంతో రూ.10లక్షల బీమా కవ రేజీ సంవత్సరానికి అందించబడుతుందని తెలిపారు. విద్యుదాఘాతం, పాముకాటు మొదలైన వాటితో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే ఈ ఇన్సూరెన్స్ కవరవుతుందని తెలిపారు. అయితే శాశ్వత వైకల్యం కోసం పూర్తి బీమాను కూడా కవర్ చేస్తుందని చెప్పారు. రూ.లక్ష వరకు చికిత్స చార్జీలు చెల్లించబడుతుందని వివరించారు. మృతిచెందిన పాలసీ హోల్డర్ పిల్లలకు విద్యా ప్రయోజనాలకు కవర్ అవుతుందని తెలిపారు. అతి తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్‌తో పోస్టాఫీస్ పథకాలు అంది స్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ క్రాంతి, పోస్ట్ మాస్టర్ శ్రీధర్, తాండూరు ఎస్‌పీవో క్రాంతి, పోస్ట్ కార్యాలయం తాండూరు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


బీమా చెక్కు అందజేస్తున్న సుబ్రమణ్యం

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

పూడూరు, జూలై 12: పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని గ్రామీ ణాభివృద్ధి సంస్థ అడిషనల్ కమిషనర్ షఫీఉల్లా అన్నారు. మండలం లోని మిర్జాపూర్ గ్రామ నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు పెంపకాన్ని పెంచాలన్నారు. ఆదేవి దంగా ప్రస్తుత వర్షాకాలంలో గుంతల్లో, మురుగు కాల్వల్లో, పాత వస్తు వుల్లో నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలన్నారు. లేదంటే నిల్వనీటిలో దోమలు అభివృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రతీచోట బ్లాక్ స్పాట్లను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. గ్రామంలో పారిశుధ్యంపై ఎంపీడీవో ఎప్పటికప్పుడు మొక్కలు నాటాలని అన్నారు. గ్రామ పారిశుధ్యంపై ఎంపీడీవో ఎప్పటికప్పుడు సందర్శిస్తూ ప్రజలు రోగాల బారిన పడ కుండా ముందు జాగ్రత్తలు తెలిపేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో, ఎంపీ డీవో, ఏపీవో పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ కమిషనర్ షఫీఉల్లా

స్పీకర్‌ను కలిసిన ఐజీ

ధారూరు, జూలై 12: మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ శుక్ర వారం సాయంత్రం వికారాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా ఆయనకు స్పీకర్‌కు పుష్ప గుచ్చం అందజేశారు. ఐజీ వెంట ఎస్పీ నారాయణరెడ్డి ఉన్నారు.


స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐజీ

తాండూరులో ఫార్మాక్లస్టర్ ఏర్పాటుకు సీఎం అంగీకారం

- వెయ్యి ఎకరాల స్థల సేకరణకు ఆదేశం
- అమృత్ 2.0 కింద తాండూరు మున్సిపాలిటీ ఎంపిక
- పారిశ్రామికవాడ క్లియరెన్స్‌కు విన్నపం
- సానుకూలంగా స్పందించిన సీఎం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 12: తాండూరు ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ఇందుకు సంబంధించి భూసేకరణ చేపట్టాలని ఆదేశించారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే హైదరాబాద్ నగరంలోని ఆయన నివాసంలో గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శుక్రవారం తాండూరులో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. తాండూరులో ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు సీఎం సానుకూలంగా ఉన్నారని, ఇందుకు అవసరమయ్యే వెయ్యి ఎకరాల స్థలాన్ని సేకరించాలని సూచించి నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులతో చర్చించి స్థలసేకరణ చేపడతామన్నారు. అమృత్ 2.0 కింద తాండూరు మున్సిపాలిటీని ఎంపిక చేయాలని, చించోళి రోడ్డుమార్గంలోని జినుగుర్తి పారిశ్రామిక వాడ ఏర్పాటుకు క్లియరెన్స్ ఇప్పించాలని, తాండూ రులో పట్టణ శివారు రాజీవ్ గృహకల్ప సమీపంలో ఐడీహెచ్ స్థలంలో ఐటీఐ ఏర్పాటు చేయాలన్నారు. లారీ ట్రాక్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం కోరగా సానుకూలంగా స్పందించారని ఆయన వివ రించారు. సాగునీటి పథకాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తాండూరు నియో జకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం సానుకూలంగా స్పందించినందుకు ఎమ్మెల్యే కృతజ్ఞ తలు తెలిపారు.


కమిటీ సభ్యులతో భేటీ అయిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కురియన్ కమిటీతో తాండూరు ఎమ్మెల్యే భేటీ

తాండూరు, జూలై 12: గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై కేంద్ర హైక మాండ్ పంపిన కురియన్ కమిటీతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భేటీ అయ్యారు. నగరంలోని గాంధీభవ న్‌లో శుక్రవారం కమిటీ బృందాన్ని కలిశారు. ఈ సందర్భంగా పార్ల మెంటు ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ చేపట్టిన ప్రచా రంతో సాధించిన ఓటు బ్యాంకు వివరాలను కమిటీ సభ్యుల ముందు ఎమ్మెల్యే వివరించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం పట్ల పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై ఎన్నికలకు వెళ్లాయని, దీంతో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందని కమిటీకి వివరిం చారు. రామమందిరం నినాదం కూడా బీజేపీకి అనుకూలంగా మారిందని ఆయన కమిటీకి వివ రించారు. బీజేపీకి అనుకూలంగా మారిందని ఆయన కమిటీకి వివరించారు.


ఇక సులభతరం..

- విద్యార్థులకు ఈజీగా అర్థమయ్యేలా పాఠ్యపుస్తకాల ముద్రణలో మార్పులు
- ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు ద్విభాష పాఠ్యపుస్తకాలు

కులకచర్ల, జూలై 12: ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమ య్యేలా వారిలో నైపుణ్యం పెంపేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రైవేట్ పాఠశా లకు దీటుగా ప్రభుత్వం ఆంగ్ల విద్యను అమలు చేస్తుంది. అయితే ఆంగ్లబోధన వింటున్న విద్యార్థులకు మెరుగైన ద్విభాష (తెలుగు, ఆంగ్లం) పుస్తకాలు అందిస్తుంది. ప్రతీ సంవత్సరం ఒక్కో తరగతి పెంచుతూ ద్విభాష పుస్తకాలను పంపిణీ చేస్తుండగా ఈ విద్యాసంవ త్సరం నుంచి పదో తరగతికి వర్తింపజేసున్నా రు. ఈ మేరకు పాఠ్యపుస్తకాలు రాగా, వాటిని ఉమ్మడి కులకచర్ల మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఆంగ్ల బోధనతో చదు వుతున్న దాదాపు 690 మంది విద్యార్థులకు పుస్త కాలు పంపిణీ చేశారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా..

ప్రభుత్వం సర్కార్ పాఠశాలల పేరుతో కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారం భించింది. అయితే బోధించే ఉపాధ్యాయులు లేక పోవడంతో ఇవి పూర్తి స్థాయిలో విజయవంతం కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి 2022-23 విద్యాసంవత్సరం నుంచి విద్యాశాఖ అన్నీ పాఠశా లల్లో ఆంగ్ల బోధన అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే అప్పటి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదవడం ఇబ్బందిగా ఉంటుందని గుర్తించి వారు


ద్విభాషలో ముద్రించిన పదో తరగతి సామాన్య శాస్త్రం

తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్ర ణలో మార్పులు చేశారు. ప్రతీ పాఠ్యాంశంలో ఓ పేజీలో తెలుగు, మరో పేజీలో ఆంగ్లంలో ముద్రిం చారు. మొదటి సారిగా ఎనిమిదో తరగతి వరకు భాషేతర పుస్తకాలైన గణితం, సామాన్య శాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పుస్తకాల్లో ముద్రిం చారు. మరుసటి ఏడాది తొమ్మిదో తరగతికి అందించగా ప్రస్తుత ఈ విద్యాసంవత్సరం నుంచి పదో తరగతికి వర్తింపజేయనున్నారు. దీంతో విద్యార్థులు సులభంగా పాఠాలు అర్థం చేసుకునేం దుకు ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అవకాశం ఉంటుంది. అదే విధంగా విద్యార్థులకు పుస్తకాల భారం కాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతీ పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించడంతో పేజీల సంఖ్య పెరిగి రెట్టింపు భారం అవుతుంది. ఈ సమస్య తలెత్తకుండా రెండు విభాగాలుగా పుస్తకాలను విభజించారు. సగం పాఠాలను భాగం-1గా మిగతా సగాన్ని భాగం-2గా విభ జించి రెండు దఫాలుగా పుస్తకాలను అందించను న్నారు. ఈ ఏడాది పదోవ తరగతి వరకు ద్విభాష పుస్తకాలను అందించడంతో ఇప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఆంగ్ల బోధన అందినట్లేనని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

చాలా సులభంగా అర్థం అవుతుంది



తెలుగు, ఆంగ్ల మాధ్య మంలో పుస్తకాలు ముద్రించ డంతో చదువుతో పాటు అర్థం చేసుకునేందుకు చాలా సుల భంగా ఉంది. గతేడాది కొద్దిగా భయం ఉండేది. ప్రస్తుతం ద్విభాషలో పుస్తకాలు ముద్రించడంతో పదో తరగ తిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం

- కార్తీక్, 10వ తరగతి విద్యార్థి, కులకచర్ల

నాలో భయం పోయింది



పదో తరగతిలో ద్విభా షలో పుస్తకాలు ముద్రించి రావడంతో పాఠాలు సుల భంగా అర్థం అవుతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను తెలుగులో చదవడంతో పాటు ఆంగ్లంలో సులభంగా ఉంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాననే భరోసా వచ్చింది.

అనిత, పదో తరగతి విద్యార్థిని, ముజాహిద్‌పూర్

విద్యార్థులకు చాలా సులభం



ద్విభాషలో 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు ముద్రించడంతో సులభంగా అర్థమయ్యేలా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపేలా ఉంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేందుకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించవచ్చు. విద్యాబోధనలో ఎలాంటి ఇబ్బంది రాకుండా మంచి నిర్ణయం తీసుకున్నారు.

- హబీబ్ అహ్మద్, ఎంఈవో, కులకచర్ల



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గురునాథ్‌రెడ్డి

కొడంగల్, జూలై 12: తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో శుక్రవారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ పదవితో సముచితస్థానం కల్పించడంతో సీఎంకు ధన్యవా దాలు తెలిపారు. మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో విదేశీ మహిళకు 12 ఏళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

శంషాబాద్ రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అక్ర మంగా డ్రగ్స్ తరలిస్తుండగా పట్టుబడిన కేసులో ఎల్‌బీ నగర్ కోర్టు ఓ విదేశీ మహిళకు 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించినట్లు డీఆర్ఐ అధికా రులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరా ల్లోకి వెళితే.. 2021లో దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న టాంజానియాకు చెందిన మహిళ 2,980 గ్రాముల డ్రగ్స్ (హెరాయిన్) కలిగి ఉంది. ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ (డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) అధికారులు బ్యాగులు తనిఖీ చేస్తుండగా ఆ మహిళ వద్ద డ్రగ్స్ పట్టుబడింది. డ్రగ్స్ విలువ దాదాపు రూ.97.37 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అప్పట్లో డీఆర్ఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలు కోర్టుకు సమర్పించారు. కేసు పూర్వాప రాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆ మహిళకు 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు.

పార్టీలకతీతంగా పట్టణ ప్రగతి

- రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 12: షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని, పార్టీలకతీ తంగా పట్టణ ప్రగతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ భవనంలో కమిషనర్ వెంకన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే శంకర్‌తోపాటు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పలు సమస్య లను సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి, అన్ని వార్డుల్లో ప్రతీరోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, పాడైన వీధి దీపాలను ఎప్పటికప్పుడు మార్చాలని, మున్సిపాలిటీ నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, దొంగతనా లను అరికట్టాలని కోరారు. ప్రతీఇంటికి మిషన్ భగీరథ కనెక్షన్లు ఇప్పించాలని, పట్టణంలో పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదను నివా రించాలని, మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలని, పట్టణ ప్రగతికి ప్రత్యేక నిధులు తేవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనతో పాటు పార్టీలకతీతంగా పట్టణ ప్రగతికి అందరూ కృషి చేయాలని సూచించారు. షాద్‌నగర్ చౌరస్తా నుంచి పై జంక్షన్ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పను లకు ప్రతిపక్షలు సహకారం అందించాలని, సర్వేల్ విస్తరణ కోసం కమిటీని నియమిస్తానని తెలిపారు. నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు జరిగేలా మున్సిపల్ సిబ్బంది దృష్టిపెట్టాలని వీధి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అంది స్తానని, అందరూ కలిసి పనిచేస్తేనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవు తుందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, వైస్ ఛైర్మన్ నటరాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, వేదికపై ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

దళితులకు న్యాయం చేయండి

కీసర, జూలై 12: మండల కేంద్రం లోని దళితులకు న్యాయం చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు విహను మంత్ రావు శుక్ర వారం మేడ్చల్ కలె క్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. కీసర దాయర సర్వేనంబర్ 173, 174, 175, 176, 179, 213లో దాదాపు 94.06 ఎకరాల భూమిని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చారని, దాదాపు 10మంది దళితులకు పట్టాలు ఇచ్చి భూమి కేటాయించినట్లు తెలిపారు. అయితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు వారి పేర్లు తొలగించి రాగి కుటుంబానికి చెందిన వ్యక్తుల పేర్లు రికార్డుల్లో నమోదు చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో కీసరకు చెందిన పలు వురు దళితులు కోర్టును ఆశ్రయించారని, వివాదంలో ఉన్న భూమిని కీసర రెవెన్యూ అధికారులు కన్వర్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కన్వర్షన్ రద్దు చేసి దళితులకు న్యాయం చేయాలని వీహెచ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.


మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హనుమంతరావు

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

ధారూరు, జూలై 12: ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీతో పాటు, ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తా మని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కు మార్ తెలిపారు. మండలంలోని కేరెళ్లి, అల్లీపూర్, కుక్కింద, ధారూరులో శుక్ర వారం సాయంత్రం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు చేసి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను ఆర్థిక విధ్వంసం చేసిందని ఆరోపించారు. ఆగస్టు 15నుంచి రైతు రుణమాఫీ, ఆరుగ్యా రంటీలను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలో ఏడాదికి 7వేల పైచి లుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు తెచ్చి, పర్యాటక రంగాన్ని అభి వృద్ధి చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. మహి ళల కోసం టెక్స్‌టైల్ పార్కులను తీసుకువస్తు న్నామని చెప్పారు. కాగా ధారూరు, కేరెళ్లి పాఠశాలల్లో ఎన్నెస్ కైట్ వారు నిర్మించిన మరుదొడ్లను ప్రారంభించి విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో జెడ్పీ సీఈవో సుధీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

వనమహోత్సవం లక్ష్యాలను పూర్తిచేయాలి

వికారాబాద్, జూలై 12: ఈ సంవత్సరం వనమహోత్సవం లక్ష్యాలను పూర్తిచేయాలని స్పెషల్ కమిషనర్, ఐఎఫ్ఎస్ షఫీఉల్లా అన్నారు. జిల్లా ప రిధిలోని మిర్జాగూడ సమీపంలో శుక్రవారం గల నర్సరీ, పల్లె ప్రకృతివనం, క్రీడాప్రాంగణంలో పనులను సందర్శించి అనంతరం వికారాబాద్ మండ లం పులుమద్ది గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్, బృహత్ పల్లెప్రకృతి వనం, వంద్ల తోటలు, వాటర్‌షెడ్ చేపట్టిన అమృత్ సరోవర్ పనులను సంద ర్శించి పనులు పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం వికారాబాద్ కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలో చేపట్టిన ఉపాధిహామీ పనుల పురోగతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈపీఎం నర్సింగ్‌రావు, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవో లు, ఈసీఎస్, డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది క్షేత్ర స్థాయి సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

కొత్తూర్ వై జంక్షన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం


44వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో పెద్దఎత్తున నిలిచిన వాహనాలు

- డీసీఎం, లారీని ఢీకొన్న మరో ట్రైలర్ లారీ
- లారీ స్కూటీపై పడటంతో ఒకరు దుర్మరణం.. ఇద్దరికి గాయాలు
- భారీగా ట్రాఫిక్ జామ్.. రెండు గంటలకు పైగా నిలిచిన వాహనాలు

కొత్తూర్, జూలై 12: మండల కేంద్రానికి సమీ పంలో 44వ జాతీయ రహదారి వైజంక్షన్ వద్ద శుక్రవారం ఓ డీసీఎంతో పాటు లారీని మరో ట్రైలర్ లారీ ఢీకొనడంతో ఘోర ప్రమాదం సంభ వించింది. రహదారి గుండా వెళ్తున్న బైక్‌పై లారీ పడడంతో, అందులో ఉన్న సరుకుల కింద పడి ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయప డ్డారు. ప్రమాదానికి గురైన లారీలు రహదారికి అడ్డంగా పడటంతో బెంగళూరు వైపు వెళ్లే జాతీయ రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. రెండు గంటలకు పైగా దాదాపు 10కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులతో


కొత్తూర్ వైజంక్షన్ ప్రమాద స్థలంలో పోలీసులు

పాటు, ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. కొందరు ప్రయాణికులు వాహనాల నుంచి దిగి కాలినడకన గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తూర్ నుంచి వైజంక్షన్ మీదుగా హైదరాబాద్ వైపు వచ్చేం దుకు డీసీఎం వాహనం జంక్షన్ వద్ద మళ్లుతుం డగా షాద్‌నగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వైపుల లోడ్‌తో వెళ్తున్న భారీ ట్రైలర్ లారీ డ్రైవర్ డీసీఎంను ఢీకొట్టి, రోడ్డుకు కుడి వైపు వెళ్లి హైదరాబాద్ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో లారీ బోల్తాపడింది. ఈ క్రమంలో లారీ పక్కనుంచి కొత్తూర్ వైపు వస్తున్న స్కూటీపై లారీ పడడంతో, లారీలో ఉన్న సరుకులు స్కూటీపై వెళ్తున్న వ్యక్తులపై పడ్డాయి. దీంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయప డ్డాడు. ప్రమాద సంఘటన పరిశీలించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, స్థానికుల సహాయంతో బోల్తాపడ్డ లారీ సరుకుల కింది నుంచి ఇద్దరు వ్యక్తులను బయటకు తీశారు. అప్పటికే ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతిచెందిన వ్యక్తి కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన అంజయ్య(50)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి కూడా పెంజర్లకు చెందిన దినేష్‌గా గుర్తించారు. వైపుల లోడుతో వెళ్తున్న ట్రైలర్ లారీ డ్రైవర్ ప్రహ్లాద్(45) అందులోనే ఇరుక్కుపోయాడు. స్థానికులతో సహాయంతో పోలీసులు ప్రహ్లాద్‌ను బయటకు తీశారు. అతడి రెండు కాళ్లు విరిగిపో యాయి. గాయపడ్డ ప్రహ్లాద్‌తో పాటు దినేష్‌ను ఆసుపత్రికి తరలించారు. తమిళనాడు లారీ డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే పరారయ్యాడు. డీసీఎం డ్రైవర్‌కు స్వల్పగాయాలైనాయి. రహదారిపై బోల్తాపడ్డ తమిళనాడు లారీతో పాటు, ప్రమాదా నికి గురైన ట్రైలర్ లారీ రహదారిపై నిలిచిపోవ డంతో బెంగళూరు 44వ జాతీయ రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. రెండు గంటలకు పైగా రహదారి స్తంభించడంతో దాదాపు 10కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయాయి. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహ రావు, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్‌లు సిబ్బందితో కలిసి ప్రొక్లెయిన్ సహాయంతో అతికష్టం మీద ట్రైలర్ లారీతో పాటు, బోల్తాపడ్డ లారీని పక్కకు తప్పించారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరు ద్ధరించారు. ప్రమాద సంఘటన స్థలం భయానక వాతావరణంగా మారింది. మృతదేహాన్ని పోలీసులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

వైభవంగా మైలమ్మ బోనాలు



మైలమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తున్న గ్రామస్తులు

కులకచర్ల, జూలై 12: మండలంలోని చాపలగూడెం గ్రామ మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ మైలమ్మ అమ్మవారికి బోనాలు నిర్వహించారు. మత్స్యకారుల సహకార సంఘం డైరెక్టర్లు మొగులయ్య, సిద్దయ్య ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం సభ్యులు, గ్రామపెద్దలు సాయప్ప, వెంకప్ప, బిచ్చయ్య, వెంకటయ్య, భీమయ్య, యాదయ్య, ఇస్వయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్.. పేద ప్రజల ప్రభుత్వం

- ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేస్తాం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కులకచర్లలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, జూలై 12: కాంగ్రెస్ పేద ప్రజల ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కులకచర్ల రైతు వేదికలో 140, చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 47మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా కులకచర్ల రైతు వేదిక దగ్గర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఆడపిల్లల పెళ్లిల విషయంలో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దని ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ కుటుంబం ఐదు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు మురళీధర్, ప్రభు, ఎంపీడీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ కులకచర్ల, చౌడాపూర్ మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, అశోక్‌కుమార్, కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



కీసర: మొక్కలు నాటుతున్న జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



కీసర రూరల్: నాగారంలో మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర, జూలై12: నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతీ విద్యార్థిపై ఉందని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మాజారావు అన్నారు. మంలంలోని రాంపల్లి దాయర గ్రామంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బృందం పాల్గొన్నారు.

కీసర రూరల్: మొక్కల పెంపును సామాజిక బాధ్యతగా భావించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి నాలుగో వార్డు శేషాద్రినగర్ కాలనీలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్ లక్ష్మి, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి నాలుగో వార్డులో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నానునాయక్, కొత్త హేమలత, మంగళపురి వెంకటేష్, రామారం శ్రీహరిగౌడ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు పాల్గొన్నారు.

బషీరాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలను నాటి పెంచాలని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ అన్నారు. మైల్వార్ గ్రామంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి నీరు పోశారు.

కొడంగల్ రూరల్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

టీబీ ఆస్పత్రి సిబ్బందిని స్థానికంగానే ఉంచాలి

వికారాబాద్, జూలై 12: టీబీ ఆసుపత్రిలో ఎన్నో ఏళ్లుగా పనిచేసిన తమను స్థానిక ఆస్పత్రుల్లోనే ఉంచాలని, దూరం పంపించవద్దని టీబీ ఆస్పత్రి సిబ్బంది కోరారు. అనంతగిరిలోని టీబీ ఆసుపత్రి వద్ద శుక్రవారం వారు నిరసన వ్యక్తం చేశారు. టీబీ ఆసుపత్రికి ఎంతో మంది వచ్చేవారని ఇప్పటికీ టీబీ బాధితులు అనంతగిరికి వస్తున్నారని తులిసానేజ ఇక్కడ టీబీ ఆసుపత్రికి కోసం నాలుగు వార్డులు ఏర్పాటు చేస్తే తాము స్థానికంగా ఇక్కడ పనిచేసుకుంటామని తెలిపారు. తమను ఎక్కడికో పంపించాలని చూస్తున్నారని వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర స్థాయిలో టీబీ విషయమై చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన ఊరడమ్మ మాత ఉత్సవాలు

బొంరాస్‌పేట్, జూలై 12: మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో గత మూడు రోజులుగా కొనసాగిన ఊరడమ్మ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సింహులునాయుడు మల్లికార్జున్ తదితరులు ఊరడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై12: రాష్ట్రంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు డిమాండ్ చేశారు. ఉపకార వేతనాలు విడుదల చేయాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆరేళ్లుగా విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడంలేదన్నారు. రాష్ట్రంలో సంవత్సరానికి 14లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, వీరికి సంవత్సరానికి 3వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. కానీ 2019 నుంచి ఇప్పటికీ బకాయిలు పేరుకుపోయి మొత్తం రూ.8214.57 కోట్లు ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించాలని జిల్లా ప్రత్యేక అధికారి కేశురాంకు విద్యార్థి సంఘం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ప్రధాన కార్యదర్శి రాథోడ్, ఉపాధ్యక్షులు అరుణ్, వంశీ, మనోజ్, సహాయ కార్యదర్శులు కిరణ్, అవినాష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి



ఎక్మాయి రైతులతో న్యూఢిల్లీ అధికారుల బృందం

బషీరాబాద్, జూలై 12: పప్పుధాన్యాల పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కృషి విజ్ఞాన, మెట్ట వ్యవసాయ కేంద్రం న్యూఢిల్లీ అధికారులు పి.రామకృష్ణ, డా.గౌతమ్ వీర్ చౌహాన్, డా.దీలిప్ సూచించారు. మండలంలోని ఎక్మాయి గ్రామం వ్యవసాయం, రైతుల సంక్షేమశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం 'మోడల్ పల్స్ విలేజ్' ప్రాజెక్టుగా ఎంపికైనందున రైతులతో సమావేశమై చర్చించారు. పప్పు ధాన్యాల సాగుకు సంబంధించిన పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, కంది సాగు చేస్తున్న రైతులు సాయిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేషం, వెంకటమ్మ, వెంకటప్ప పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణకు వేలం

వికారాబాద్, జూలై 12: వికారాబాద్ మునిసిపల్ పరిధిలో చికెన్, మటన్ చేపల వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో ఐదుగురు వ్యాపారులు పాల్గొనగా రూ.3.25లక్షలకు అస్లం చాంద్ షేక్, మేరిన్ ఫుడ్స్, ఫీడ్స్ ఇంటర్ ప్రైస్ టెండర్ కైవసం చేసుకున్నారు. వీరికి జూలై 15 నుంచి మార్చి 31 వరకు కాల పరిమితి ఉంటుందని మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మోమిన్‌పేట్, జూలై 12: మండలంలోని టేకులపల్లి అనుబంధ గ్రామం సుద్దొడుకా తండాలో మాజీ సర్పంచ్ రైస్ శుక్రవారం సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పర్శురాంగౌడ్, రాములునాయక్, బాబునాయక్, మోహన్‌నాయక్, ఉపేందర్‌నాయక్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి విరాళం

తాండూరు రూరల్, జూలై 12: చంద్రవంచ గ్రామంలో నిర్మిస్తున్న పురాతనమైన హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన పటేల్ మునీందర్ గుడి నిర్మాణానికి విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయం వద్ద మునీందర్ రూ.51వేలను ఆలయ చైర్మన్లు పటేల్ రవిశంకర్, సుందర్‌రెడ్డిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

భూగర్భ వంతెన నిర్మించాలి

ఘట్‌కేసర్, జూలై 12: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని లోని అన్నోజిగూడ వద్ద ఎన్ఎఫ్‌సీ చౌరస్తా వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దాటేందుకు భూగర్భ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని ఎంపీ నివాసంలో కలిసి సమస్యను వివరించారు. ఆయన వెంట కౌన్సిలర్ గొంగళ్ల మహేష్ ఉన్నాడు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పెద్దేముల్: ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



కులకచర్ల: బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

యాలాల, జూలై 12: రాస్నం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను తోటి సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. బదిలైన ఉపాధ్యాయులు వీరేశం, మోహనయ్య, ప్రశాంత్, మాధవిలకు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరహరిరెడ్డి, ఉపాధ్యాయ బృందం మల్లారెడ్డి, పావని, ఆనంద్, సంగీత పాల్గొన్నారు.

పెద్దేముల్: పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటలక్ష్మి, నఫీజ్ సుల్తానా, రాధ, సంగీతలతో పాటు ఇదే పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు అన్నపూర్ణ, సంతోష, శిరీష, నాజియాబేగం, రెహానాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్: పర్వత్‌పల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి వేర్వేరు పాఠశాలలకు ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు ప్రతాప్, విజయ్‌లను శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు పాండురంగా రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, చాంద్‌పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల: ముజాహిద్ పూర్ గ్రామ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మేనేజర్ రవికాంత్, ఫీల్డ్ ఆఫీసర్ నాగిరెడ్డి బదిలీ అయ్యారు. గ్రామ రైతులు, ప్రజలు, పొదుపు సంఘాల సభ్యులు శుక్రవారం వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రభూపాల్, రమేశ్, మైమూద్ అలీ, శివకుమార్, తుక్యనాయక్, యాదయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

కులకచర్ల: ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం జైపాల్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ గాదె లక్ష్మి, మహిపాల్, ఉపాధ్యాయులు చందర్, మంజుల, సీఆర్పీ మహిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూరును, బీఆర్ఎస్‌ను వీడేది లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, జూలై 12: తాండూరును, బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాండూరులోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసుత్తం, భవిష్యత్తులో తాండూరు బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా తానే ఉంటానని తెలిపారు. పార్టీలో సీనియర్ నేత ఒకరు ఇన్‌చార్జిగా తనను తప్పించాలని కేటీఆర్‌ను కోరినట్లు ప్రశ్నించగా రోహిత్‌రెడ్డి స్పందించారు. కేటీఆర్ రోజు నాకు టచ్‌లో ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని తాండూరును వీడేది లేదని, తుదిశ్వాస వరకు తాండూరు ప్రజలతోనే ఉంటానని చెప్పారు. వ్యాపార, అనారోగ్య సమస్యల కారణంగా రెండు నెలలు అందుబాటులో లేకపోయానని చెప్పారు. తాండూరులో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కుటుంబసభ్యుల ద్వారా సాండ్, నాపరాతి గనులు, భూమి సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికారులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరి స్తున్నారని దుయ్యబట్టారు. పబ్లిక్ సర్వెంట్లుగా వ్యవహరించాలని కొందరు కక్షపూరితగా వ్యవహరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. తాండూరు అభివృద్ధికి తాను తెచ్చిన నిధులను వ్యయం చేసి అబివృద్ధి చేయలేకపోతున్నారని పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించలేకపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ హామీలన్ని భూటకమని చెప్పారు. మెగా డీఎస్సీ హామీని, ఆరు గ్యారంటీల అమలును నిలబెట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీశైల్‌రెడ్డి, శ్రీనివాసచారి, నహీం, రవీందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

పార్టీలకతీతంగా తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను శుక్రవారం తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ జడ్పీటీసీ మంజుల, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, పెద్దేముల్ మాజీ ఎంపీపీ అనురాధ, మాజీ వైస్ ఎంపీపీలు అన్నపూర్ణ స్వరూప, ఎంపీటీసీలను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైల్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన షబ్బీర్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లలేక ఇంటి దగ్గరే ఆక్సిజన్ అందిస్తూ కుటుంబ సభ్యులు కాపాడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్‌కు చెందిన సల్మాన్‌ఖాన్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మైనారిటీలు సల్మాన్‌ఖాన్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూడేరు మాజీ ఎంపీటీసీ ఆదిల్, మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఆయుబ్, సదర్ ఖలీల్, మైమూద్, షఫీ, మోయిన్, రియాజ్, మోయిజ్, ముక్తార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **పూడూరు:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అంతుందని ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. మండల పరిధిలోని అంగడిచిట్టెం పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాన్ని శుక్రవారంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వితలయ్య, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ రవి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ రవి పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్:** సీజనల్ వ్యాధులను ప్రబలకుండ తగుచర్యలు తీసుకుంటున్నామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఆమె స్థానికులతో కలిసి దోమల నివారణ కోసం చెటేరు కుంటలో అయిల్‌బాల్స్ వేశారు. అంతకు ముందు ఘట్‌కేసర్‌లోని జడ్పీ బాలుర పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద మంజూరైన రెండు అదనపు గదుల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సైదులు, కౌన్సిలర్లు రమాదేవి, నస్రీన్ సుల్తానా, హెచ్ఎం పాపిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
- **కులకచర్ల:** జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాలతో శుక్రవారం కులకచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఇతర ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- **తాండూరు:** బహిరంగ ప్రదేశాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తుంటే ఆప్రాంతంలో ముగ్గులు వేసి చెత్త వేయకుండా తాండూరు మున్సిపాలిటీ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం శాంతినగర్ కాలనీలో ఈ ప్రాంత కార్మికులు, జవాన్లు కలిసి చెత్త వేసేస్థలాన్ని గుర్తించి మహిళ, కార్మికుల చేత ముగ్గులు వేయించి అక్కడ చెత్తవేయకుండా చర్యలు తీసుకున్నారు.
- **మేడ్చల్ టౌన్:** విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటాలని మేడ్చల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ ఎంఆర్ఈఎం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగి రెడ్డి, పర్యావరణ ఇంజినీఆర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, కౌన్సిలర్ తుడుమ్ గణేష్, ఎంఆర్ఈఎం చైర్మన్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **మేడ్చల్ టౌన్:** నూతనంగా రాష్ట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రీతం కుమార్‌ను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మూడుచింతలపల్లి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్యాద పూరకంగా కలిశారు. శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రీతం కుమార్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు భానుచందర్ పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్:** తాండూరు మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదరణ పథకం కింద చేపట్టే పనులు నాణ్యతగా ఉండేవిధంగా చేపట్టాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ కోరారు. శుక్రవారం తాండూరు మండల పరిధిలోని గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డతండా పాఠశాలల్లో కొనసాగుతున్న అమ్మఆదరణ పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జయమ్మ, వీవో తదితరులున్నారు.

క్రైం కార్నర్

వర్క్‌ఫ్రం హోం పేర రూ.6 లక్షలు లూటీ

కీసర రూరల్, జులై 12: వర్క్ ఫ్రం హోం పేరుతో సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ మహిళ మోసపోయిన ఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం కీసర మండల కేంద్రంలో నివసించే లహరి గృహిణి. తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఉన్న రాక్ ఫ్రంట్ కాలనీలో నివాసముంటోంది. ఆమె విధుల్లో ఉండగా ఈనెల 4న వర్క్ ఫ్రం హోం ద్వారా ఆన్‌లైన్‌లో పని చేస్తూ సులువుగా డబ్బులు సంపాదించవచ్చని టెలిగ్రాం గ్రూప్ ద్వారా ఆమెను సంప్రదించారు. మాయమాటలు నమ్మిన ఆమె వారి ఉచ్చులో చిక్కింది. గూగుల్‌స్టార్ రేటింగ్స్ ఇస్తే, ఇచ్చిన టాస్క్‌లను పూర్తిచేసిన పక్షంలో వెంటనే డబ్బులు చెల్లిస్తామని ఆమెకు ఆశ చూపారు. బ్యాంక్ ఖాతా, తదితర వివరాలు తెలియజేయాల్సిందిగా సూచించారు. వారి మాయమాటలు నమ్మిన లహరి తన బ్యాంక్ ఖాతాకు సంబంధించిన పూర్తి వివరాలను వెలువరించింది. వెంటనే ఆమెకు చెప్పిన విధంగా రూ.2,800 చెల్లించారు. టాస్క్‌లను పూర్తి చేయటంతో పాటు పెట్టుబడి పెట్టిన పక్షంలో లక్షల్లో లాభం వస్తుందని ఆశచూపారు. వారి సూచనల మేరకు ఇచ్చిన టాస్క్‌లను, గేమ్‌లను పూర్తి చేస్తూ పెట్టుబడిగా ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తూ వచ్చిన ఆమెకు లాభంతో కలిపి తిరిగి ఇస్తూ వచ్చారు. ఇదంతా కూడా టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా చాటింగ్ చేస్తూ వ్యవహారాన్ని కొనసాగించారు. మధ్యమధ్యలో నకిలీ సభ్యులను సృష్టించి, వారికి లక్షల్లో రూపాయలు పొందినట్లు గ్రూపుల్లో నమ్మబలికించారు. ఇదంతా నమ్మిన లహరి తన ఖాతా నుంచి గురువారం పెద్ద మొత్తంలో రూ.40వేలు సైబర్ మోసగాళ్ల వారి ఖాతాలో వేయించుకున్నారు. ఆ డబ్బులు తిరగి ఇవ్వకపోగా వివిధ కారణాలు చెబుతూ విడతల వారీగా అదనంగా రూ.6లక్షలను వారి ఖాతాలో జమచేయించుకున్నారు. మరో రూ.6లక్షలు చెల్లిస్తే ఒకేసారి రూ.12లక్షలు చెల్లిస్తామని చెప్పారు. వారి మోసాన్ని గమనించిన లహరి భర్త కిషన్ వెంటనే కీసర పోలీసులను ఆశ్రయించగా వారు సైబర్ క్రైం వారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

పెద్దేముల్, జూలై 12: విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందూరు గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఇందూరు గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటప్ప(40) మొహర్రం సందర్భంగా గ్రామంలో చీకట్లు తొలగించేందుకు వీధుల్లోని స్తంభాలు కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నాడు. ఏడు స్తంభాలకు ఏడు బల్బులు వేశాడు. ఎనిమిదవ బల్బు వేసే సమయంలో విద్యుత్‌షాక్‌తో స్తంభం పైనుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటప్పది రెక్కాడితే గానీ డొక్కాడని పేదకుటుంబం. పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంకునేవాడు. అతడి ఆకస్మిక మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొడంగల్ రూరల్, జూలై 12: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన కొడంగల్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొంరాస్‌పేట్ మండలం గడిసింగాపూర్ గ్రామానికి చెందిన గొట్లపల్లి రామ్‌రెడ్డి(30) ఈనెల 6న తన అత్తగారి గ్రామం కొడంగల్ మండలం బుల్కాపూర్‌కు బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో హైదరాబాద్-బీజాపూర్ హైవేలో బుల్కాపూర్ గేటు దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. 108 వాహనంలో తాండూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ రామమ్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదేశానుసారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికుడు



హాజీంపాషా (ఫైల్)

బషీరాబాద్, జూలై 12: మండలంలోని జీవన్గి కాగ్నానది చెక్‌డ్యాం వద్ద గల్లంతైన యువకుడు శుక్రవారం నీటిలో శవమై తేలాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హాజీంపాషా(30) గురువారం ఉదయం ఇద్దరు స్నేహితులతో కలిసి స్థానిక చెక్‌డ్యాం వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు చేపల పట్టేందుకు నీటిలోకి దిగగా, ఒడ్డున ఉన్న హాజీంపాషా తన దుస్తులు విడిచి కనిపించకుండా పోయాడు. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు నీటిలో మునిగిపోయి ఉండొచ్చని భావించి స్థానికుల సాయంతో సాయంత్రం వరకు నీటిలో గాలించిన ఆచుకీ లభ్యం కాలేదు. తిరిగి శుక్రవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు మళ్లీ నీటిలో దిగి కర్రతో గాలిస్తుండగా 24గంటల తర్వాత మృతదేహం నీటిలోంచి పైకి వచ్చింది. వెంటనే మృతదేహాన్ని నీటిలోంచి ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే అక్కడున్న కుటుంబసభ్యులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఎవరిపై ఎలాంటి అనుమానం లేకపోవడంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు ముగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న పది మందిపై కేసు నమోదు

దౌల్తాబాద్, జూలై 12: పేకాడుతున్న పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామంలో కొంత మంది పేకాడుతున్నట్లు తెలుసుకొని పోలీసు సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. అక్కడ పేకాడుతూ పది మంది పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.29500నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన పదిమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు.. తల్లిదండ్రులకు అప్పగింత



తల్లిదండ్రులు, గ్రామస్థులతో బాలుడు గణేశ్

కొడంగల్, జూలై 12: తీర్థయాత్రల్లో తప్పిపోయిన ఓ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన కొడంగల్ మండలం అన్నారం గ్రామంలో వెలుగుచూసింది. బాలుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నారం గ్రామంలో రెండు నెలల కిందట సంపూర్ణ రామాయణం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. వీధినాటక ప్రదర్శన ముగిసిన తర్వాత పాత్రధారులు, గ్రామస్థులు 45మంది కలిసి అయోధ్య, కాశీ తీర్థయాత్రలకు వెళ్లారు. గ్రామానికి చెందిన వడ్డె రాములు, కుమారుడు గణేశ్ వారి వెంబడి వెళ్లారు. అయోధ్యలో శ్రీరాముడి దర్శనం అనంతరం కాశీ దర్శనం చేసుకోగా వడ్డె రాములు కుమారుడు గణేశ్ తప్పిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు నాలుగు రోజుల పాటు అక్కడ వారి ఆచూకీ కోసం వెతికారు. బాలుడి జాడ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం చేసేదిలేక అన్నారం వచ్చేశారు. తిరిగి నాలుగు రోజుల కిందట బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్థులు నలుగురితో కలిసి అయోధ్య, కాశీకి వెళ్లారు. బాలుడిని వెతుకుతున్న క్రమంలో బీహార్ చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ ద్వారా వికారాబాద్, హైదరాబాద్ చైల్డ్‌లైన్ అధికారులకు బాలుడు తమ దగ్గర ఉన్నాడని సమాచారం అందించారు. దీంతో వికారాబాద్ జిల్లా పరిధిలోని చైల్డ్‌లైన్ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో అన్నారంకు చెందిన రాములు కుమారుడు గణేశ్‌గా గుర్తించారు. గ్రామానికి చెందిన వడ్డె వెంకటప్ప, పట్నం అంజి, మంగలి వీరేశ్, విజయ్, హలీమ్ తదితరులు అక్కడికి చేరుకొని తల్లిదండ్రులకు విషయం తెలిపారు. దీంతో శుక్రవారం బీహార్‌లోని చైల్డ్‌లైన్ అధికారులు కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించి బాలుడిని అప్పగించడంతో తప్పిపోయిన బాలుడి కథ సుఖాంతమైంది.

చెంగిచర్ల కబేళా టెండరు రద్దు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చెంగిచర్ల కబేళా నిర్వహణ టెండర్లు రద్దయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలవగా.. అదే పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ ఒకరు టెండరు దాఖలు చేశారు. సింగిల్ బిడ్ దాఖలు కావటంతో.. ఈ ప్రభుత్వం టెండర్లు రద్దు చేయాలని ఆదేశించింది. ఈమేరకు తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు టెండర్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ కబేళాను కొన్నేళ్లుగా సదరు మాజీ ఎమ్మెల్సీ నిర్వహిస్తున్నారు. 2018లో కాంట్రాక్టు గడువు ముగిసింది. అప్పటి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలవకుండా బోర్డులో తీర్మానం చేయించి మళ్లీ పాత ఏజెన్సీకే టెండరు అప్పగించింది. అయితే 70 ఎకరాల స్థలం, అధునాతన వసతులతో కూడిన కబేళా నిర్వహణను పాత టెండరు లెక్క ప్రకారం ఏడాదికి రూ.1.92 కోట్లు చెల్లించేలా బోర్డులో నిర్ణయం తీసుకున్నారు. కానీ అప్పుడున్న మార్కెట్ ధరల ప్రకారం అది చాలా తక్కువ. దీంతో పలు ఫిర్యాదులు రావడంతో రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.